క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ పరిధిలో 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సీసీఐ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మావల మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్ మండలంలోని బోథ్, పొచ్చెర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుస్తకాలు చదవాలి

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధులు మానసిక ఆందోళన చెందకుండా పుస్తకాలు చదవాలని జిల్లా వయోవృద్ధుల సమైక్య సంఘం అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో శుక్రవారం వృద్ధులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. కవులు ఉదారి నారాయణ, కమ్మల నర్సిములను సత్కారించారు., కార్యక్రమంలో శివయ్య, విశ్వంబర్, పోశెట్టి, భాస్కర్, సురేష్, రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు సీరం సుదర్శనకు చెందిన ఇల్లు కాలిపోయింది. విషయం తెలుసుకున్న తుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ. 5 వేలు అందజేశారు. ప్రభుత్వం నుండి రూ. 8 వేల ఆర్థిక సాయం అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం పిప్పల్‌ధరి గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆత్రం లక్ష్మణ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అభిలాష్, సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి

బోథ్: జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఏఎన్ఎం అమిబాయి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎంపీపీ శ్రీనివాస్ ఉదారత



వాహనంలో బాలుడిని ఎక్కిస్తున్న ఎంపీపీ

బోథ్: మండలంలోని లంబాడితండా గ్రామానికి చెందిన జాదవ్ రాజు అనే బాలుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అటుగా నిగిని గ్రామానికి వెళ్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడిని గమనించి తన వాహనంలో బోథ్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఎంపీపీకి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

అడవుల సంరక్షణకు సహకరించాలి



స్వాధీనం చేసుకున్న కలపతో అధికారులు

నేరడిగొండ: అటవీ సంరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎఫ్ఆర్‌వో గణేశ్ కోరారు. శుక్రవారం మండలంలోని కుంటాల, నాగమల్యాల్ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. రూ.5వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి కటకట..

- అడుగంటిన భూగర్భజలాలు
- సరఫరా కాని భగీరథ నీరు
- ఇబ్బంది పడుతున్న గట్టేపల్లి, చిత్తగూడ, కొలాంగూడ ప్రజలు



కాలినడకన నీటిని తీసుకెళ్తున్న గిరిజనులు

ఇంద్రవెల్లి: ప్రతీ గ్రామానికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో గిరిజన గ్రామాలకు తాగునీరు అందడం లేదు. తాగునీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకుంటున్నారు. మండలంలోని గట్టేపల్లి, చిత్తగూడ, కొలాంగూడ గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బావులు, చేతి పంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. కలుషిత నీటిని తాగి అనారోగ్యానికి గురి అవుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బావి నీరేదిక్కు..

మండలంలోని గట్టేపల్లి పరిధిలోని కోలాం గిరిజనులకు వేసవిలో బావి నీరే దిక్కువుతుంది. సుమారు 20 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. నీటి సమస్యపై అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టడంలో విఫమైయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. చేతి పంపులు అడుగంటడంతో వ్యవసాయ బావి నీరు తాగుతున్నామని చెబుతున్నారు.

80 కుటుంబాలకు ఒకటే చేతిపంపు



గట్టేపల్లిలో చేతిపంపు వద్ద మహిళలు

గట్టేపెల్లి గ్రామంలోని మూడు చేతిపంపుల్లో నీరు అడుగంటింది. ప్రస్తుతం ఒక్కటే చేతిపంపు పని చేస్తోంది. ఈచేతి పంపు నుంచే ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి గంటల తరబడి వేచి ఉండి నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. భగీరథ నీరు సరఫరా కోసం ఇంటింటికీ ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు లీకేజీలు ఉండడంతో నీరు సరఫరా కావడం లేదు.

కలుషిత నీరే వినియోగం..



చిత్తగూడలో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

చిత్తగూడ గ్రామంలో 25 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నారు. భగీరథ నీరు నెలకు మూడుసార్లు మాత్రమే సరఫరా అవుతోంది. దీంతో అడవిలో ఉన్న చేతిపంపు నీటిని తీసుకువచ్చి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. చేతిపంపు ఫ్లాట్‌ఫాం పూర్తిగా చెడిపోవడంతో నీరు కలుషితమవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భగీరథ నీరు రావడం లేదు



మా గ్రామానికి భగీరథ నీరు ఎప్పుడు వస్తాదో తెలియదు. పది రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. చేతి పంపుల్లో నీరు అడుగంటింది. వ్యవసాయ బావిలోని కాలుషిత నీటినే తాగుతున్నాం. గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించాలి.

– కోడప లక్ష్మీబాయి, కొలాంగూడ

పట్టించుకోవడం లేదు



నీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామంలో ఉన్న చేతి పంపులో నీరు రావడం లేదు. దీంతో వ్యవసాయ బావి నీటినే వినియోగిస్తున్నాం. కాలుషిత నీటితో అనారోగ్యం బారిన పడుతున్నాం.

– కోడప ధర్ము, కొలాంగూడ

పడిగాపులు కాస్తున్నాం



గ్రామంలో నాలుగు చేతి పంపులున్నా.. నీరు రావడం లేదు. ఒకటే చేతి పంపు నుంచి 80 కుటుంబాలు నీటిని తెచ్చుకుంటున్నారు. తెల్లవారు జమున మూడు గంటల నుంచి తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్నాం. ప్రతిరోజు గ్రామానికి నీటిని సరఫరా చేయాలి.

– గేడం మల్కు, గట్టేపల్లి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



శిలువ మోస్తూ ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సెయింట్‌పాల్స్, సీఎస్ఐ, మోరియా, బెతెస్థ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సెయింట్ పాల్ చర్చిలో శిలువ మోసే కార్యక్రమం నిర్వహించారు.

లస్సీ పంపిణీ..

సీఎస్సై, లక్కారం చర్చి వద్ద కాంగ్రెస్ నాయకులు దుర్వ మహేశ్ ఆధ్వర్యంలో లస్సీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు విజయ్, రాజు, మహేశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాంసి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ చర్చిలో యేసుక్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువ మార్గ్‌ను మోస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చర్చి పాధర్ జోముస్, బ్రదర్ అరుణ్, మనోజ్, వినోద్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థన చేశారు. ఏసు సందేశాలను భక్తులకు వివరించామని చర్చి ఫాదర్ తెలిపారు.

ఘనంగా బాజీరావ్ బాబా సప్తాహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: మండలంలోని కరంజి గ్రామంలో బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకిలో బాబా చిత్రపటాన్ని ఉంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు నిర్వాహకులు ప్రవచనాలు, కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, రైతుబంధు జిల్లా కమిటీ అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పస్ లింగారెడ్డి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తగూడెం తరలిన ఆదివాసీలు

బోథ్: కొత్తగూడెంలో ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న ఆదివాసీ తెగల బహిరంగ సభకు మండలం నుంచి ఆదివాసీ నాయకులు తరలివెళ్లారు. బోథ్, పట్నాపూర్, ధన్నూర్, కౌఠ, పార్డితో పాటు ఆయా ఆదివాసీ గూడెల్లో నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, రాజన్న మడావి భీంరావ్, లక్ష్మణ్, పురుషోత్తం, మానిక్ రావ్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



పార్టీలో చేరుతున్న మహిళలు, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇటీవల అంబేద్కర్ ఉత్సవ కమిటీని ఎన్నుకోగా శుక్రవారం ఎమ్మెల్యేను మర్యా ద పూర్వకంగా కలిశారు. దళిత సంఘాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్, బాబాసాహెబ్ కాంబ్లే, స్వామి, మల్లన్న, భూమన్న, శోభ, రత్నజాడే ప్రజ్ఞకుమార్, కుశ్వర్తబాయి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కైలాస్‌నగర్: బేడ బుడగ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపుల రాజుతో పాటు రాంనగర్‌కు చెందిన మహిళలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళలు, యువత, రైతాంగాన్ని ప్రధాని నరేంద్రమోదీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్, కౌన్సిలర్ సతీశ్, రాజేశ్, అశోక్, రమణ, లక్ష్మి, స్వప్న, గంగమ్మ పాల్గొన్నారు.

రాంజీగోండ్ వర్ధంతి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మర్సుకోల తిరుపతి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల హక్కుల కోసం బ్రిటీష్ వారితో పోరాడిన వీరుడు రాంజీగోండ్ 166వ వర్ధంతిని జయప్రదం చేయాలని నిర్వహణ కమిటీ చైర్మన్ మర్సుకోల తిరుపతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్ లో మాట్లాడారు. ఈనెల 9న మండలంలో రాంజీగోండ్‌నగర్‌లో వర్ధంతి నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు మనోహర్, భుజంగ్‌రావు, సుగుణ, కోటేశ్‌రావు, సలాం దేవురావు, సోనేరావు మహేందర్, హన్మంత్‌రావు, సీతారాం, మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు చల్లని తాగునీరు



తాగునీటి ఫ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం

గుడిహత్నూర్: ప్రయాణికులు చల్లని తాగునీటిని అందించడమే లక్ష్యమని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్‌లో తాగునీటి ఫ్రిడ్జ్‌ను ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ప్రయాణికులే సంక్షేమమే సంస్థకు ముఖ్యమన్నారు. వారికి వసతులు కల్పించేందు ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఎం కల్పన, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఆర్టీసీ అధికారులు శివదాస్, కంట్రోలర్ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. సాగునీటికి రైతన్నల పాట్లు



నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ శివారులోని రైతులు రబీ పంటసాగు కోసం పదరాని పాట్లు పడుతున్నారు. స్వయంగా నీటి సరఫరా కోసం కాలువను శుభ్రం చేసుకుంటున్నారు. అధికారులు సక్రమంగా నీటి సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సంబంధిత అధికారి: వినోద్, డీఈ, ఫోన్: 76719 51131

బడుగుబలహీన వర్గాలకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

బజార్‌హత్నూర్: బడుగుబలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం రైతువేదికలో 79 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్, అధికార ప్రతినిధి మొట్టే కిరణ్, నీలాదేవి, కానిందే రాజారాం, లక్కం తిరుమల, పరచ లావణ్య సాయన్న, కవిత రఘుస్‌రెడ్డి, విద్యాసాగరా, కుర్మే నారమ్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు



నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని ప్రజలు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం పంచాయతీ అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరుకావాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా మండల సాధన సమితి నాయకులతో పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు. అయితే ఎమ్మెల్యే పర్యటన రద్దు అయింది. మండలంగా ఏర్పాటు చేసే వరకు ఉద్యమాన్ని ఆపబోమని నాయకులు పేర్కొన్నారు. అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ అన్నారు.

సొనాల అభివృద్ధి లక్ష్యం

బోథ్: సొనాల గ్రామాభివృద్ధే లక్ష్యమని గ్రామానికి చెందిన యువకులు ఇర్ల అభిలాష్, గౌతంరెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉదయ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బాపురావు వస్తున్న నేపథ్యంలో సర్పంచ్ సదానందం పోలీసులకు తెలియజేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

రేషన్ దుకాణాల్లో మినీ బ్యాంకులు

- అందుబాటులో తపాలాశాఖ పౌర సేవలు
- డీలర్లకు సమకూరనున్న అదనపు ఆదాయం



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారుడు

బోథ్: తపాలాశాఖ రేషన్ దుకాణాల ద్వారా పౌర సేవలు విస్తరించనుంది. ఇందులో భాగంగా రేషన్ దుకాణాలను మినీ బ్యాంకులుగా మార్చాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆదిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో రేషన్ దుకాణదారులకు ఆదాయమార్గం చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

తపాలాశాఖ సహకారంతో..

తపాలాశాఖ వారి ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) సహకారంతో రేషన్ దుకాణాల్లో పౌర సేవలు విస్తరించాలని నిర్ణయించారు. నగరం, పట్టణ ప్రాంతాల్లో మినహాయిస్తే బ్యాంకింగ్ సేవలు అంతగా అందుబాటులో లేని పల్లె ప్రాంతాల్లో ఇవి ఉపయోగపడుతాయి. వినియోగదారులు విద్యుత్, నల్లా, ఫోన్ బిల్లులు వాటి నుంచి చెల్లించవచ్చు. నగదు, డిజిటల్ లావాదేవీలు కొనసాగించవచ్చు. దీంతో ప్రజలకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారనున్నాయి.

అవగాహన ఉన్న వారికే..

స్మార్ట్ ఫోన్, అంతర్జాల వినియోగంపై అవగాహన ఉన్న డీలర్లను ముందుగా ఎంపిక చేస్తున్నారు. డీలర్ల ఫోన్లలో తపాలాశాఖ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ఈయాప్ ద్వారా లావాదేవీలు కొనసాగిస్తారు. డీలర్లు లావాదేవీలు విస్తరిస్తే దానికి అనుగుణంగా కమిషన్ ఇస్తారు. ప్రతీ లావాదేవీకి రూ.4 చొప్పున నెలలో రూ.5 లక్షలు దాటితే రూ.11 చొప్పున చెల్లించనున్నారు. ప్రతీ నెల 1 నుంచి 15 వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ ఉంటుంది. తర్వాత రోజుల్లో డీలర్లు ఖాళీగా ఉంటారు. ఈ సమయాన్ని డిజిటల్ లావాదేవీలకు వినియోగించడంతో అదనంగా ఆదాయం సమకూరనుంది.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలోని బోథ్ మండలంలో 24 రేషన్ దుకాణాలు ఉండగా 13,287 రేషన్ కార్డులు ఉన్నాయి. బజార్‌హత్నూర్ మండలంలో 21 రేషన్ దుకాణాలు, 7,856 రేషన్ కార్డులు, భీంపూర్ మండలంలో 15 రేషన్ దుకాణాలు, 6,919 రేషన్ కార్డులు, గుడిహత్నూర్ మండలంలో 12 రేషన్ దుకాణాలు, 8,433 రేషన్ కార్డులు, ఇచ్చోడ మండలంలో 20 రేషన్ దుకాణాలు, 11,591 రేషన్ కార్డులు, నేరడిగొండ మండలంలో 16 రేషన్ దుకాణాలు, 7,885 రేషన్ కార్డులు, సిరికొండ మండలంలో 8 రేషన్ దుకాణాలు, 4,359 రేషన్ కార్డులు, తలమడుగు మండలంలో 16 రేషన్ దుకాణాలు, 9,451 రేషన్ కార్డులు, తాంసి మండలంలో 10 రేషన్ దుకాణాలు, 4,854 రేషన్ కార్డులున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 142 రేషన్ దుకాణాలుండగా 74,635 రేషన్ కార్డులున్నాయి.

త్వరలో ప్రారంభిస్తాం

రేషన్ దుకాణాల్లో బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశంతో తపాలాశాఖ సహాయంతో మినీ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నాం. డీలర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తాం. త్వరలోనే దుకాణాల్లో బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తాం. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ సేవలు ఎంతోగానో ఉపయోగపడుతాయి.

– కిరణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఆదిలాబాద్